




## నెలనెలా సందేహాల సందోహాలు

# ఇల్లు

"ఇండియా ప్రయాణం ఎప్పుడు?" స్నేహితురాలి పలకరింపుతో ఊహా ప్రపంచంలోంచి బయటపడ్డాను.

"ఇంకో వారంలో. అంతలో ఇదిగో పనులన్నీ ఓ కొలిక్కి తీసుకురావడం పెద్ద సమస్య"

"వారంలో ఇండియాలో ఉంటావన్న మాట. ఇలా ఏదైనా ప్రయాణానికి ముందు ఎంతో ఉత్సాహంగా ఉంటుందేం? అందులోనూ మనం పుట్టి పెరిగిన దేశం వెళుతున్నప్పుడు, కదా?"

" ఆనందంతో పాటూ ఏదో సంశయమూ, సంకోచమూ వెంటాడుతుంటుది నన్నెప్పుడూ."

"అదేంటే అలా అంటావు? నాకైతే తెలుసా, ఒక నెల ముందరి నుండీ జ్ఞాపకాలు, కలల మధ్య మా ఊరు నాతో మాట్లాడ్డం మొదలు పెడుతుంది. వసంతం, వేపపూలు, కమ్ముకొచ్చే మేఘాలు, వర్షం వెలిసిన తర్వాత తాకే మెత్తని సూర్యకాంతి, సాయంకాలం వాకిట్లో చల్లిన నీళ్ళకి భూమి పొరల్లోంచి ఉబికి వచ్చే కమ్మని మట్టి వాసన, అద్భుతమైన రంగులతో క్షితిజ రేఖని దాచేసే సూర్యాస్తమయం. అన్నింటినీ మించి.... అన్నింటినీ మించి నాకు గుర్తుకు వచ్చేదేంటో తెలుసా? అమావాస్య నాటి ఆకాశం. దాన్నిండా పరుచుకొన్న లెక్కలేనన్ని నక్షత్రాలు. నవారు మంచం మీద నడుం వాలిస్తే మారుమూల పల్లెటూళ్ళోని నీకు విశ్వం అంతా స్నేహితులే. "

"కవయిత్రి ననిపించుకున్నావ్. ఎంత అందంగా చెప్పావు. కొంచెంగా ఈర్ష్యగా కూడా ఉందే, నీ జ్ఞాపకాలు అంత మధురమైనవని"

"ఏం, అలా అంటావు? నీకేమనిపిస్తుందేం? అవును సరే, నువ్వు చెప్పు. తిరిగి మన దేశం వెళ్ళిపోవాలని నీకనిపిస్తుండదా? గతం నిన్నెప్పుడూ వెనక్కి రమ్మని పిలవదా? "

"ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం నా వల్లయే పని కాదు కానీ, వేరే ఏదైనా మాట్లాడుదాం."

"అలా అని దాటేయడం గొప్ప తెలివి అనుకుంటున్నావు. ఇవ్వాళ నిన్ను వదిలేది లేదు. చెప్పు అసలు భారత దేశం అంటే అర్థం ఏమిటి నీ జీవితంలో దాని ప్రాముఖ్యత ఎంత మాత్రం"

"భారత దేశం, దాని అర్థం. ఏమిటమ్మాయి, నన్ను నా మానాన వదిలేయక ఇలాంటి చిక్కు ప్రశ్నలెందుకు?"

"ఇన్నాళ్ళు వదిలాను కదా, ఇవ్వాళ చెప్పు. ఇండియా అనగానే నీకు ముందు ఏం గుర్తుకు వస్తుంది?"

"మేఘాలు. మిట్ట మధ్యాహ్నం కాలం నాటి మేఘాలు. ఎవరో పరిగెడుతున్నారు. ఆయాసంతో వగరుస్తూ , తన ప్రాణంకోసం అన్నట్లుగా . నీడ పొడలుగా ఎండ. నీడ, ఎండ, ఆయాసం, దాహం, తిరిగి అంతా కలిపి ఓ క్లిష్టమైన సమీకరణం. కాలం వృధా చేసే మెట్ట వేదాంతం."

"నిజంగా? నిన్నర్థం చేసుకోవాలంటే మరో యుగం పడుతుంది కానీ, ఇంకా చిన్న ప్రశ్న వేస్తాను. జవాబు చెప్పు. అసలు నీకు ఇల్లు అనగానే ఏ ప్రదేశం ముందు గుర్తుకు వస్తుంది?"

"సరే, నన్నీ ప్రశ్న అడగనీ ముందు. ఇంత అందమైన జ్ఞాపకులతో అల్లుకుపోయిన ప్రదేశాన్ని వదిలి నువ్వెలా ఉండగలుగుతున్నావు? "

"దూరం ప్రేమని పెంచుతుందంటారు చూడు. అలాగన్న మాట. అసలైనా వలస పోయే పక్షుల్లాగే, విదేశాలకు వలస వచ్చే మనుషుల్లోనూ ఆ కుతూహలం, కొత్త, మేలైన జీవితం కోసమని ప్రపంచానికి అవతల వేపు ఎగిరి పోవడం సహజమే. కానీ దూరం, ఆటంకాలు, ఇబ్బందులూ, ఇవన్నీ తిరుగు ప్రయాణం కోసమే. ఎన్నో దేశాల్నుండి ఇక్కడకు వచ్చే వాళ్ళనడుగు, తిరిగి ఇంటికి వెళ్ళటమనేది, వాళ్ళ కళ్ళల్లో అనునిత్యం వెలిగే కోరిక. పుట్టిన దేశం గురించి మాట్లాడమను, ఆ కళ్ళు మూసేసి, కలలు బంధించి, ఆశలు మధించి చెబుతారు నీకు కబుర్లు. జీవితానికి ఓ అర్థాన్నిచ్చే కాంక్ష. అదే, ఆ తియ్యని భావమే నన్నిక్కడ ఉంచుతుంది. వలస పక్షి కోరిక."

"బావుంది. ఇదంతా తిరిగి వచ్చిన చోటుకే వెళ్ళాలన్న తపన అంటావు. అవును ఆలోచిస్తే మానవ సహజమే అనిపిస్తుంది."

"సరే నువ్వు చెప్పు. ఇల్లంటే నీకు ఏం గుర్తుకు వస్తుంది? "

. I have an idea that some men are born out of their due place. Accident has cast them amid certain surroundings, but they have always a nostalgia for a home they know not. They are strangers in their birthplace, and the leafy lanes they have known from childhood or the populous streets in which they have played, remain but a place of passage. They may spend their whole lives aliens among their kindred and remain aloof among the only scenes they have ever known. Perhaps it is this sense of strangeness that sends men far and wide in the search for something permanent, to which they may attach themselves. Perhaps some deep-rooted atavism urges the wanderer back to lands which his ancestors left in the dim beginnings of history. Sometimes a man hits upon a place to which he mysteriously feels that he belongs. Here is the home he sought, and he will settle amid scenes that he has never seen before, among men he has never known, as though they were familiar to him from his birth. Here at last he finds rest.

అదుగో సరిగ్గా నేనలా ఆలోచిస్తాను. ఎక్కడో పుట్టాను, ఎక్కడో పెరిగాను, మరెక్కడో బతుకుతున్నాను. ఇంతవరకూ నా అన్న ప్రదేశం నాకు తగల్లేదు. ఇంకా వెతుకుతూనే ఉన్నాను. అందుకే ఒక ప్రదేశంతో అనుబంధం ఉన్న నీలాంటి వాళ్ళని చూస్తే నాకసూయ. అంతగా, మనసంతగా నిండిపోయే, కాలం నిలిచిపోయే, నాకో అర్థాన్నిచ్చే కానీ నాకు తెలియని ఈ ప్రదేశం గురించి నా మనసు నిండా దిగులే. "

"సరిగ్గా అర్థం కాలేదు. ఒకవేళ అలాంటి ప్రదేశం తటస్థించిందే అనుకో. నీకెలా తెలుసు అదే నువ్వు వెదుకుతున్నదని? అందమా, లేక ప్రజలా మరి లేక సమాజ రీతులా? వీటిలో నీకేది ముఖ్యం? ఆలోచించావా ఎప్పుడైనా? "

"చాలా. ఇప్పటికి చాలా అందమైన ప్రదేశాలు చూశాను. అందం మనసుని కదిలిస్తుంది కానీ నాకెందుకో ఈ కదలిక పైపైన పొరల్లోంచి వస్తున్నట్లనిపిస్తుంది. మెదడులో నాడీ తంత్రుల సంచలనం తెలుస్తోంది. నా కుటుంబంలో ప్రేమలు, మానవ సహజమైన అన్ని భావాలు

అనుభవించాను. వాటికై వెతుక్కోవటం లేదు. ఇక సమాజం సంగతంటావా? మనకు తగ్గ సమాజం ఇంకా ఏర్పడలేదని నాకో సంశయం. ఈ విశాల ప్రపంచంలో ఎక్కడో ఉంది నాలో సగం. దాన్ని వెతుక్కుంటున్నానుకుంటా"

"ఆగాగు. నువ్వు చెప్పేదాన్ని బట్టి చూస్తుంటే, ఇదంతా నిన్ను నువ్వు వెదుక్కొనే ప్రయత్నం లాగా ఉంది. అంటే, నువ్వు ప్రస్తుతం చేస్తున్న పని, జీవిస్తున్న జీవితం నీవి కావన్న మాట. అమ్మాయ్, నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసా?"

"నీతో వచ్చిన చిక్కల్లా ఇదే ఇలాంటి సమస్యలు అర్థమై ఛస్తాయి నీకు" నవ్వుతూ నెత్తి మీద ఓ మొట్టికాయ వేశాను దాన్ని.

"సరే, ఊహలు గుర్రాలనుకొందాం కాసేపు. అలా షికారు వెళ్ళొద్దాం పద. ఒకవేళ చెయ్యగలిగే ధైర్యమే ఉంటే ఇవన్నీ వదిలేసి ఎక్కడకు పోతావు?"

"అమేజాన్ నదీ తీరాన అడవులో,  సహారా ఎడారుల మద్య గుడారాలో, హక్కిడో పర్వత శ్రేణులో ఎవరికి తెలుసు? తెలిసే నేనింకా ఇక్కడే ఉంటానా "

✡✡✡

